సాక్షి నల్లగొండ

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



మెరుగైన విద్యకు కృషి

పాఠశాలల్లో మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని పాఠశాల విద్యా డైరెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. - 8లో



మకర తోరణం బహూకరణ

యాదాద్రీశుడికి బంగారు తాపడం చేసిన మకర తోరణాన్ని హైదరాబాద్‌కు చెందిన మనీష్,అపర్ణ దంపతులు అందజేశారు. - 8లో



చోరీ ముఠా అరెస్ట్

ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్ చోరీకి పాల్పడుతున్న ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

సాగర సోయగం

సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన శ్రీశైలం నుంచి భారీగా వరద వస్తుండడంతో గురువారం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. రాత్రి 10 గంటల సమయంలో 3,70,489 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్ ఫ్లో 2,72,704 క్యూసెక్కులుగా నమోదైంది. సాగర్ జలాశయ నీటిమట్టం 586.20 అడుగులు (301.3570టీఎంసీలు)గా ఉంది. అటు కృష్ణమ్మ పరవళ్లు, ఇటు నదీ తీర అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. సుందర దృశ్యాలను కెమెరాల్లో బంధించేందుకు పోటీపడ్డారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. - నాగార్జునసాగర్

న్యూస్‌రీల్

రిటైర్డ్ ఉద్యోగులకు నేడు ఉచిత కంటి పరీక్షలు

నల్లగొండ రూరల్: జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ చంద్ర, శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టాప్రా ప్రైవేట్ ఆస్పత్రి సహకారంతో ఈ కంటి పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఎస్పీ రాములు నాయక్‌తో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాఘవరావు, సిబ్బంది సూరప్పనాయుడు, నరేష్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

నల్లగొండ: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నల్లగొండ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కే.విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో శిక్షణతోపాటు ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ : 08682 220007 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గుణాత్మక విద్యనందించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించినప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేట్ అధికారి(జీఈసీఓ) పెండ్యాల సరిత అన్నారు. గురువారం ఆమె తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందినప్పుడే వారు ఆరోగ్యంగా ఉండి ఏకాగ్రతతో చదువుతారన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని, చదువులో వెనుక బడినవారిపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన కేజీబీవీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ కవిత, ఉపాధ్యాయులు పుష్పలత, హిమబిందు, మీనా, విమల తదితరులు ఉన్నారు.

మత్స్య టెండర్లపై అనాసక్తి

చేపపిల్లల సరఫరాకు ముందుకురాని కాంట్రాక్టర్లు

- రెండుసార్లు టెండర్లు పిలిచినా ఫలితం శూన్యం
- గతేడాది బిల్లులు నిలిపివేసిన ప్రభుత్వం
- గతంలో జరిగిన అవకతవకలే కారణం
- ఈ ఏడాది చేపపిల్లల సరఫరా ప్రశ్నార్థకం



చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు	జిల్లాకు అవసరమైన చేపపిల్లలు
1,200	5 కోట్లు

నల్లగొండ టూటౌన్: జిల్లాలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదిలేందుకు ఉచిత చేపపిల్లల పంపిణీకి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది చెరువులు, కుంటల్లోకి సమృద్ధికి నీరు వచ్చినా ఉచిత చేపపిల్లలు వదిలే ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. మత్స్యకారుల అభ్యున్నతికి గత ప్రభుత్వ హయాం నుంచి మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏటా ఉచితంగా చేపపిల్లలను సరఫరా చేస్తోంది. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీరులేకుండా పోయింది. అయినప్పటికీ ప్రభుత్వం మత్స్యకారులకు చేపపిల్లలను సరఫరా చేసింది. చెరువులు, కుంటల్లో నీరు లేకపోయినా చేప పిల్లలు పోసినట్లు తప్పుడు లెక్కలతో ప్రభుత్వానికి బిల్లులు పెట్టినట్లు ప్రచారం జరిగింది. ఇదే విషయంపై మత్స్యకార సంఘాల నాయకులు కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. దాంతోనే అప్పటి కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం నిలిపివేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో చేపపిల్లల పంపిణీలో జరిగిన అవకతవకలతోపాటు రాష్ట్ర స్థాయిలో కూడా మత్స్య శాఖలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోంది. ఈ కారణాల వల్లే కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదనే చర్చ నడుస్తోంది. ఫలితంగా ఈ ఏడాది కాంట్రాక్టర్లు ఎవరూ టెండర్లు వేసేందుకు ముందడుగు వేయడం లేదని తెలుస్తోంది.

టెండర్లు వేసేందుకు జంకుతున్న కాంట్రాక్టర్లు

ఉచిత చేపపిల్లల సరఫరా కోసం రాష్ట్ర స్థాయిలోనే టెండర్లు పిలుస్తారు. జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు రెండు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో దాదాపు ఐదు కోట్ల చేపపిల్లలు అవసరం ఉంటాయని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో జరిగిన అవకతవకల కారణంగానే ఇప్పటి వరకు రెండుసార్లు టెండర్లు పిలిచినా జిల్లాకు చేపపిల్లలు సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్లు ఎందుకు ముందుకు రావడంలేదని సంబంధిత శాఖలోని కొందరు ఉద్యోగులు చర్చించుకోవడం గమనార్హం. కాంట్రాక్టర్లు రెండవ సారి కూడా టెండర్లు వేయకపోవడంతో ప్రభుత్వం మరోసారి టెండర్లు పిలిచింది.

నగదు బదిలీ చేస్తేనే మేలంటున్న మత్స్యకారులు

ఉచిత చేపపిల్లల పంపిణీలో కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి మత్స్యకారులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లెక్కింపు సమయంలోనే కాంట్రాక్టర్లు తమను మాయం చేస్తున్నట్లు మత్స్యకారులు పలుసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. చేపపిల్లలను లెక్కించాలంటే చాలా సమయం పడుతుందని, లెక్కింపు అంత సులభం కాదని బుట్టల్లో పోసి అంచనా వేసి లెక్కిస్తుండడంతో కాంట్రాక్టర్లకే లాభం చేకూరుతుందని, తాము నష్టపోతున్నామని మత్స్యకారులు చెబుతున్నారు. నగదు బదిలీ చేస్తే అక్రమాలకు తావులేకుండా నాణ్యమైన చేపపిల్ల ను కొనుగోలు చేసుకోవచ్చనేది మత్స్యకారుల వాదన. కానీ ఇది కార్యరూపం దాల్చకపోవడంతో తాము నష్టపోవాల్సి వస్తుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీలగిరిలో 'ఒలింపిక్స్' సంబరాలు



క్లాక్‌టవర్ సెంటర్‌లో సంబరాలు జరుపుకుంటున్న హాకీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు

నల్లగొండ టూటౌన్: పారిస్ ఒలింపిక్స్ పోటీల్లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం గెలుపొందిన సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియార సెంటర్‌లో హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకొని జట్టుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం, కోచ్ శ్రీనివాసచారి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ పుల్లయ్య, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా 'డిండి'ని పూర్తిచేయాలి

మునుగోడు: దేశంలో అత్యధికంగా ఫ్లోరిన్ సమస్య ఉన్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి జిల్లాలోని 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూపకల్పన చేసిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డీపీఆర్‌ని ఆమోదించకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకానికి రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. అంతేకాకుండా శ్రీశైలం సొరంగ మార్గం పనులనూ వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సురిగి చలపతి, బొల్గూరి నర్సింహ, గుర్జ రామచంద్రం, తిరిపారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు గోసుకొండ లింగయ్య, వనం వెంకన్న, రమేష్, ఈదులకంటి కైలాస్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

హామీల అమలులో విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపిస్తామన్నారు. ప్రస్తుతం రెండు పార్టీలే ఉన్నాయని, బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ అని అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు దేశ సమైక్యత కోసం ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు వీరెళ్లి చంద్రశేఖర్, కర్నాటి సురేష్‌కుమార్, పోతెపాక సాంబయ్య, చెనమోని రాములు, పోతెపాక లింగస్వామి, పెరిక మునికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

కృష్ణా బేసిన్‌పై బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం

- మీడియా చిట్ చాట్‌లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో కృష్ణా బేసిన్‌పై బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రద్ధ పెట్టలేదని, నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడారు. కుప్పకూలిన సుంకిశాలకు పెట్టిన రూ.2 -3 వేల కోట్లు సొరంగానికి పెడితే అది పూర్తయ్యేదన్నారు. చైర్మన్ హోదాలో ఉన్న తాను సలహా మాత్రమే ఇవ్వగలనని, ఒత్తిడి చేయలేనని పేర్కొన్నారు. సొరంగం పూర్తయితే 10 టీఎంసీల నీరు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. డిండికి నీటిని ఎక్కడి నుంచి తీసుకుంటారో త్వరగా తేల్చాలన్నారు. తద్వారా డీపీఆర్ ఆమోదంతోపాటు, పర్యావరణ అనుమతులు తీసుకోవాలన్నారు. గతంలో దీనిపై నిర్లక్ష్యం చేశారని, ఇప్పుడు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. టన్నెల్ పనులు పూర్తి చేయడంతోపాటు ఉదయ సముద్రం, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలను వేగంగా పూర్తి చేయాలన్నారు. వీటన్నింటినీ పూర్తి చేస్తే జిల్లాలో 90 శాతం ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటుతో మూసీ ప్రక్షాళనకు పూనుకోవడం మంచి పరిణామమన్నారు. రెగ్యులర్‌గా వాటర్ ఫ్లో ఉండేలా చేయడం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు.

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ సి.నారాయణరెడ్డి



నల్లగొండ: ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి గురువారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, వీటిని స్థానిక ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించాలన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్య అతిథి సందేశానికి సంబంధించిన నోట్స్‌ను ఈనెల 12లోగా జిల్లా అధికారులు సీపీఓకు అప్పగించాలన్నారు. అన్ని పథకాలపై శాఖల వారీగా శకటాలను రూపొందించాలని, స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను సోమవారంలోగా సమర్పించాలని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంస పత్రాలకు పేర్లను ఈనెల 13నాటికి కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు పండగ వాతావరణంలో స్వాతంత్ర దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. పతాకావిష్కరణలో తప్పనిసరిగా ప్రొటోకాల్ నిబంధనలను పాటించాలన్నారు.

'మిషన్ పరివర్తన్'ను విజయవంతం చేయాలి

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన మిషన్ పరివర్తన్‌లో భాగంగా ఈనెల 9 నుంచి 14 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. 14న అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో పెద్ద ఎత్తున ముగింపు సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరుకానున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా గార్డ్ ఆఫ్ హానర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా ఆయా పోలీస్ స్టేషన్ల వారీగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్‌లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, విద్య, ఎక్సైజ్, పోలీస్, మున్సిపల్, వ్యవసాయ, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు హాజరయ్యారు.

కాంగ్రెస్ బలోపేతంలో సేవాదళ్‌ది కీలకపాత్ర

- కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో సేవాదళ్ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సేవాదళ్‌లో గ్రామస్థాయి నుంచి పనిచేస్తున్న వారికి పార్టీలో సముచిత స్థానం ఇస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు లాల్జీ దేశాయ్ హామీ ఇచ్చారని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన ఈ సంస్థలో పనిచేయడానికి జిల్లా కార్యవర్గం నుంచి గ్రామ కార్యవర్గం వరకు ఆసక్తి ఉన్నవారు 9490705312 ఫోన్ నంబర్‌కు తమ పూర్తి వివరాలతో వాట్సాప్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, ఉపాధ్యక్షుడు వహీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేకల సాగర్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

త్రిపురారం: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం త్రిపురారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వందనం శ్రీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయ కుమారి, ఎంఈఓ బాలాజీ నాయక్, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, కోడిరెక్క రాజేంద్రకుమార్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ, అధికారులు

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చిలుకూరు: కుటుంబానికి దూరంగా అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామానికి చెందిన జిలకర రమేష్(45) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. అతడు తన కుటుంబ సభ్యులుగా దూరంగా అదే గ్రామానికి చెందిన మైలారిశెట్టి రామకోటమ్మ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం రాత్రి 9గంటల వరకు ఇంటి యజమానితో మాట్లాడిన రమేష్ ఆ తర్వాత నిద్రకు ఉపక్రమించాడు. గురువారం ఉదయం 7గంటల వరకు కూడా అతడు ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో ఇంటి యజమాని కిటికీలో నుంచి చూడగా రమేష్ ఉరేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబానికి దూరంగా ఉంటుండడంతో మనస్తాపానికి గురై రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తెలిపారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు. మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు(గైనకాలజీ 3, అనస్తీషియా 3, ఎంబీబీఎస్ 5) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ డి. మాతృ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4గంటల లోపు దరఖాస్తులను డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 11గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

లారీని ఢీకొట్టిన బైక్.. యువకుడు మృతి

భువనగిరి క్రైం: బైక్‌పై వెళ్తున్న యువకుడు లారీని ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ పరిధిలోని ఎల్లమ్మ గుడి సమీపంలో గురువారం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బేదంపురి మండలం సుజాతానగర్ గ్రామానికి చెందిన కంగాల ఆదర్శ్(24) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. గురువారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆదర్శ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ల నిర్వహణకు టెండర్లు

నల్లగొండ రూరల్: జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో ఉన్న ఖాళీ స్థలాల నిర్వహణ, మడిగెలు, క్యాంటీన్, పార్కింగ్, బస్టాండ్ నిర్వహణ, ఫ్రీ టాయిలెట్, మ్యానువల్ కార్గో, టీవీల ఏర్పాటు, వివిధ అవుట్ సోర్సింగ్ పనులకు టెండర్లు విడుదల చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా వివాహాది శుభకార్యాలు, విహారయాత్రలకు బస్సులు బుక్ చేసుకుంటే 10శాతం రాయితీ ఇస్తున్నట్లు నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్ మరొక ప్రకటనలో పేర్కొన్నారు.



నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు



సాగర్ నీటి విడుదలను చూస్తున్న మహిళలు



సాగర్ నీటి విడుదలను చూసేందుకు వెళ్తున్న పర్యాటకులు



సాగర్ ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగుతున్న యువతులు



సెల్ఫీ దిగుతున్న యువకులు



లాంచీలో ప్రయాణిస్తున్న పర్యాటకులు



ఆటోల్లో సాగర్ చూసేందుకు వచ్చిన పర్యాటకులు

ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్ చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

- రూ.9లక్షల నగదు, కారు స్వాధీనం
- నిందితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో 34 కేసులు నమోదు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

నల్లగొండ క్రైం: వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్, కాపర్ కాయిల్స్ చోరీకి పాల్పడుతున్న ఐదుగురు ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9లక్షల నగదు, కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మేఘావత్ రంగానాయక్, అదే జిల్లా మాచవరానికి చెందిన జఠావత్ ఇమామ్‌నాయక్, మాచవరం మండలం సింగరాయపాలెం తండాకు చెందిన జఠావత్ మౌలానానాయక్, జఠావత్ వలినాయక్, చందంపేట మండలం వెల్మలమంద గ్రామానికి చెందిన కేతావత్ సునీల్ హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో నివాసముండేవారు. ఈ క్రమంలో వారి మధ్య పరిచయం ఏర్పడింది. దీంతో వారు ఒక ముఠాగా ఏర్పడి కేతావత్ సునీల్ సహకారంతో నల్లగొండ జిల్లాలోని వాడపల్లి, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం, నిడమనూరు, తిప్పర్తి, నల్లగొండ, నకిరేకల్, చిట్యాల, సూర్యాపేట ప్రాంతాల్లో ఉదయం వ్యవసాయ బావుల వద్ద రెక్కీ నిర్వహించి అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న ఆయిల్, కాపర్ కాయిల్స్‌ను చోరీ చేసి కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లి తమకు తెలిసిన పాత ఇనుప సామాను దుకాణంలో విక్రయించి సొమ్ము చేసుకునేవారు. గురువారం వాడపల్లి పోలీసులు నర్సాపురం రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ తెలుపు రంగు కారు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపి అందులోని ఐదుగురు వ్యక్తులను విచారించగా చోరీలకు పాల్పడుతున్న విషయం బయటపడిందని ఎస్పీ పేర్కొన్నారు. నిందితులపై జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 34 కేసులు ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో పాత ఇనుము వ్యాపారం చేసే ముడావత్ సుజాత, నరేష్‌ను కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్పీ వివరించారు. ఈ కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, రమేష్‌బాబు, ఎస్ఐ రవి, మహేందర్, తదితరులను ఎస్పీ అభినందించారు.

తిమ్మన్నగూడెంలో విషాదఛాయలు

- హైదరాబాద్‌లో పరీక్ష రాస్తూ కుప్పకూలిన విద్యార్థి
- ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి



అరుణ్ (ఫైల్)

కనగల్: పరీక్ష రాస్తూ కుప్పకూలిన యువకుడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం తిమ్మన్నగూడేనికి చెందిన ఐతగోని సైదులు, సావిత్రి దంపతుల రెండో కుమారుడు ఐతగోని అరుణ్(20) హైదరాబాద్‌లోని మల్లారెడ్డి స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ యూనివర్సిటీ సూరారం బ్రాంచ్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అరుణ్ గురువారం కళాశాలలో పరీక్షకు హాజరై రాస్తుండగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. కళాశాల సిబ్బంది అంబులెన్స్‌లో అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కళాశాల యజమాన్యం వెంటనే స్పందించి ఉంటే అరుణ్ బతికేవాడని, ఆస్పత్రికి ఆలస్యంగా తరలించడంతోనే మృతిచెందాడని అతడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అరుణ్ గుండెపోటుతో చనిపోయాడా లేదా ఫిట్స్ వచ్చి మృతిచెందాడా అనేది తెలియడంలేదు. చేతికందొచ్చిన కొడుకు చనిపోవడంతో అరుణ్ తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రెయిన్ సిమెంట్ పరిశ్రమకు జాతీయ స్థాయి అవార్డు



కిషన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పరిశ్రమ జీఎం శ్రీనివాసరెడ్డి

మేళ్లచెరువు: మండలంలోని రామాపురం పరిధిలో గల రెయిన్ సిమెంట్ పరిశ్రమకు చెందిన సున్నపురాయి గనులకు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ 2022–23 సంవత్సరానికి గాను సస్టెయినబుల్ డెవలప్‌మెంట్, మినరల్ కన్జర్వేషన్ మరియు సోషల్ రెస్పాన్సిబులిటీ విభాగంలో ఫైవ్ స్టార్ అవార్డు లభించినట్లు పరిశ్రమ అధికారులు గురువారం తెలిపారు. బుధవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, సహాయ మంత్రి సతీష్‌చంద్ర దూబే చేతుల మీదుగా ఈ అవార్డును రెయిన్ సిమెంట్ పరిశ్రమ గనుల జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి అందుకున్నారు. వరుసగా రెండో సంవత్సరం జాతీయ స్థాయిలో అవార్డు లభించిందని పరిశ్రమ అధికారులు తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో పరిశ్రమ టెక్నికల్ హెడ్ జీవీకే ప్రసాద్, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ ఆదినారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా.. ఒకరు మృతి

- మరో నలుగురికి గాయాలు



యాదగిరిగౌడ్ (ఫైల్)



ఆరె యాదగిరిగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరి క్రైం: కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి బైపాస్ రోడ్డులో గల వివేరా హోటల్ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట గ్రామానికి చెందిన ఆరె యాదగిరిగౌడ్(60), చుక్కల సత్యం, ఆకుల నర్సింహ, శ్రీనివాస్, వంటేరు నారాయణ బుధవారం కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి యాదగిరిగుట్టకు వస్తుండగా.. భువనగిరి బైపాస్ రోడ్డులో వివేరా హోటల్ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యాదగిరిగౌడ్ మృతిచెందగా.. మిగతా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

నివాళులర్పించిన ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే..

యాదగిరిగుట్ట: గతంలో ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆరె యాదగిరిగౌడ్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆరె యాదగిరిగౌడ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. గురువారం ఆమెతో పాటు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధతో పాటు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం తదితరులు యాదగిరిగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

గడ్డి మందు తాగి వివాహిత బలవన్మరణం

చండూరు: గడ్డి మందు తాగిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఈ ఘటన చండూరు మండలం తాస్కానిగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాస్కానిగూడెం గ్రామానికి చెందిన పాలకూరి ఇంద్రజ(23)ను ఎనిమిదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన బాలరాజుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి సంతానం కలగకపోవడంతో ఇంద్రజ కొంతకాలంగా భర్తకు దూరంగా తల్లిగారింటి వద్దే ఉంటుంది. మానసికంగా కుంగిపోయిన ఇంద్రజ బుధవారం ఇంట్లో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

సూర్యాపేట టౌన్: వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే చనిపోయాడని మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడేనికి చెందిన శివరాత్రి ఇద్దయ్య(62) మోకాలి నొప్పి చికిత్స కోసం గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. ఆస్పత్రి సిబ్బంది అతడికి ఇంజెక్షన్ వేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో మరో ఇంజెక్షన్ వేయడంతో ఇద్దయ్య మృతి చెందాడు. ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది ఇద్దయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది ఇంజెక్షన్ చేయడమ వలనే ఇద్దయ్య చనిపోయాడని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయమై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరగా.. తాము ఇద్దయ్య కుటుంబ సభ్యులకు ముందే చెప్పామని, వారికి చెప్పే జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లామని తెలిపారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- భార్యాభర్తలతో అనభ్యకర ప్రవర్తన
- అడ్డుకున్న స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐపై దాడి

చివ్వెంల(సూర్యాపేట): మద్యం మత్తులో ముగ్గురు యువకులు భార్యాభర్తల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో అడ్డుకున్న స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామ శివారులోని వైన్ షాపు వద్ద మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు రోడ్డుపై సూర్యాపేట నుంచి ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామం వైపు బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తల పట్ల అసభ్య ప్రవర్తిస్తుండటంతో, అక్కడ నుంచి వెళ్తున్న సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ వారిని అడ్డుకుని ప్రశ్నించాడు. దీంతో యువకులు పోలీసు శాఖలో ఓ ఉన్నతాధికారి తమ బంధువు అంటూ ఏఎస్ఐపై దాడికి దిగి, అతని వద్ద సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీంతో ఏఎస్ఐ వారిని వెంబడించడంతో సెల్‌ఫోన్ ఒక షాపులో ఇచ్చి బైక్ అక్కడే వదిలివేసి పరారయ్యారు. దీంతో ఏఎస్ఐ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్ఐ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా.. ఏఎస్ఐ వాస కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువకుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. కాగా ఈ ఘటనపై సూర్యాపేట ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం.

మెరుగైన విద్యనందించేందుకు కృషి

- పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి



కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో రాష్ట్ర అధికారుల బృందం సభ్యులు

కొండమల్లేపల్లి, చింతపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మెరుగైన విద్యనందించేందుకు సర్కార్ కృషిచేస్తోందని పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి, జేడీ వెంకటనర్సింహ, ఆర్‌జేడీ మదన్ మోహన్, సమగ్ర శిక్ష అభియాన్ జేడీ విజయలక్ష్మి అన్నారు. గురువారం వారు కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత, చింతపల్లి మండలం కుర్రంపల్లి పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల బోధన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బోధన నైపుణ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులుగా తాము పనిచేసిన అనుభవాలను పాఠశాల ఉపాధ్యాయులతో పంచుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యలో నూతన ఒరవడిని అందిపుచ్చుకోవాలని సూచించారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా ప్రాంగణాలు, పీఈటీల వ్యవస్థ పటిష్టతకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట చింతపల్లి ఎంఈఓ గురువారావు, కొండమల్లేపల్లి స్కూల్ హెచ్ఎం నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుమారుడి అప్పులు.. తల్లి ఆత్మహత్య

సూర్యాపేటటౌన్: కుమారుడు చేసిన అప్పుల బాధ భరించలేక తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాపురం బజార్‌కు చెందిన బల్సుకూరి తిరుపతయ్య, కళమ్మ(45) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. చిన్న కుమారుడు బల్సుకూరి సందీప్ జల్సాలకు అలవాటు పడి తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వాళ్లు రోజూ ఇంటి వద్దకు వచ్చి అడుగుతుండడంతో మనస్థాపం చెందిన తల్లి కళమ్మ బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు సమీపంలో గల బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

పులిచింతల ప్రాజెక్టు11 గేట్లు ఎత్తివేత



పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు గురువారం నాగార్జునసాగర్ నుంచి 2,58,779 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో 11 గేట్లను ఎత్తి నీటిని దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోని 6 గేట్లను 2.5 మీటర్లు, 5 గేట్లను 3 మీటర్లు పైకి ఎత్తి 2,46,682 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పవర్‌హౌజ్‌కు 16 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 35.45 టీఎంసీల నీరు ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 51.18 మీటర్ల మేర నీరు ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 167.91 అడుగుల నీరు ఉంది.

80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

పులిచింతల ప్రాజెక్టులోని తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మొత్తం 120 మెగావాట్లు కాగా ప్రస్తుతం 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.

టెయిల్‌పాండ్ నుంచి 2,58,412 క్యూసెక్కులు



టెయిల్‌పాండ్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

అడవిదేవులపల్లి: నాగార్జునసాగర్ జలాశయం నుంచి టెయిల్‌పాండ్‌కు 2,53,882 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో టెయిల్‌పాండ్ నుంచి దిగువకు 2,58,412 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

యాదాద్రీశుడికి మకర తోరణం బహూకరణ



బంగారు తాపడంతో తయారుచేసిన మకర తోరణాన్ని అందజేస్తున్న మనీష్, అపర్ణ దంపతులు

యాదగిరిగుట్ట : యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామికి బంగారు తాపడం చేసిన మకర తోరణం(ప్రభ)ను హైదరాబాద్‌లోని మెహిదీపట్నంకు చెందిన మనీష్, అపర్ణ దంపతులు అందజేశారు. మనీష్ దంపతులు గురువారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత రూ.3లక్షల విలువ గల బంగారు తాపడంతో తయారు చేసిన మకర తోరణాన్ని ఈఓ భాస్కర్ రావుకు అందించారు. తమ మొక్కులో భాగంగా స్వామి వారికి మకర తోరణం అందించినట్లు మనీష్, అపర్ణ దంపతులు వెల్లడించారు.



సుంకిశాల పంప్‌హౌజ్‌లోకి నీరు వెళ్లేది ఇక్కడి నుంచే..



పంప్‌హౌజ్ నిర్మాణం కూలిపోవడంతో నిలిచిపోయిన వాహనాలు